

వైద్య సేవల్లో జిల్లాకు ఏ గ్రేడ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆగస్టులో ప్రజలకు వైద్య సేవలు అందించడం ద్వారా జిల్లాకు ఏ గ్రేడ్ వచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు పొందిన వారు, ఆసుపత్రిలో చేరిన వారు, సాధారణ ప్రసవాలు, లేబరేటరీ లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న వారు, తాత్కాలిక కుటుంబ నియంత్రణ గర్భనిరోధక సాధనాలు వేయించుకున్న వారి సంఖ్యను బట్టి, ఆరోగ్య సేవలను అందించడంలో వైఎస్ఆర్ కడప జిల్లా మాత్రమే ఏ గ్రేడ్ సాధించిందని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులను, సిబ్బందిని అభినందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండేలా ప్రజలకు వైద్య సేవలను ఎల్లప్పుడూ అందించాలని పేర్కొన్నారు.

తమ్ముళ్ల తన్నులాట

అన్నక్యాంటీన్ల ప్రారంభోత్సవంలో బాహాబాహీ
రాజంపేట, చక్రాయపేటలో రచ్చ
కడపలోనూ నాయకుల మధ్య విభేదాలు
పార్లమెంట్ అధ్యక్షుని ఇంటిపై రాళ్లదాడి





అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవంలో గొడవ పడుతున్న తెలుగు తమ్ముళ్లు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయి. రెండ్రోజుల కిందట ఉమ్మడి జిల్లా పులివెందుల నియోజకవర్గం పరిధిలోని చక్రాయపేట మండల ఇన్‌ఛార్జి వర్సెస్ కార్యకర్తల తిరుగుబాటు, తాజాగా రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలసుబ్రమణ్యం వర్సెస్ పార్లమెంట్ అధ్యక్షులు జగన్ మోహన్‌రాజు గ్రూపుల మధ్య నువ్వానేనా అనే రీతిలో హోరాహోరీగా తలపడిన నేపథ్యం చర్చనీయాంశంగా మారింది. రాజంపేట నియోజకవర్గ పరిధిలోని కేడర్ రెండుగా చీలిపోయింది. రాజంపేట పార్లమెంట్, నియోజకవర్గ స్థాయి నాయకుల మధ్య పొగసిన వాతావరణం తెలుగు తమ్ముళ్ల పరువును బజారు పడేసిందని చెప్పవచ్చు.

ఉమ్మడి జిల్లా తెలుగుతమ్ముళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చోటుచేసుకున్న వెన్నుపోటు రాజకీయాలే పరస్పర విభేదాలకు, దాడులకు కారణమని తెలుస్తోంది. రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యానికి నియోజకవర్గంలోని పలువురు సీనియర్లు సహకరించకపోవడంతో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి లోలోపల రగిలిపోతున్న నాయక గణం అదునుకోసం నిరీక్షించింది. రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి సర్కారు పలు దఫాలుగా అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తూవస్తోంది. గురువారం రాజంపేటలో అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవాన్ని టిడిపి అసెంబ్లీ ఇన్‌ఛార్జి బాలసుబ్రమణ్యం నిర్వహించారు. పార్లమెంట్ అధ్యక్షులు జగన్ మోహన్‌రాజును ఆహ్వానించకపోవడం, ప్రొటోకాల్ పాటించకపోవడంతో ఇద్దరి అనుచరుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ఇరు గ్రూపుల మధ్య తోపులాటలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం రాత్రి పది గంటల సమయంలో రాయచోటిలో పార్లమెంట్ అధ్యక్షుని ఇంటిపై రాళ్ల దాడి చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఎవరి తప్పో, ఎవరిది ఒప్పో నిర్ధారించనప్పటికీ తమ్ముళ్ల మధ్య తన్నులాట మరోసారి బహిర్గతం కావడం గమనార్హం.

టెన్షన్..టెన్షన్..

రాజంపేటలో ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది. ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ కేంద్రంగా తమ్ముళ్ల మోహరింపు తీవ్ర ఉత్కంఠను కలిగించింది. సహజంగా ఇటువంటి దాడులు, ప్రతిదాడుల ఘటనలు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య చోటు చేసుకోవడం పరిపాటి. ఇందుకు విరుద్ధంగా అధికార పార్టీలోని తెలుగు తమ్ముళ్ల మధ్య నెలకొనడం విస్మయాన్ని కలిగిస్తోంది. పులివెందుల నియోజకవర్గ పరిధిలో చక్రాయపేట మండల టిడిపి ఇన్‌ఛార్జిపై కార్యకర్తల తిరుగుబాటు ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి జోక్యం చేసుకోవడంతో తిరుగుబాటు తాత్కాలికంగా సద్దుమణిగింది. వీటితో పాటు కడప తెలుగుతమ్ముళ్ల మధ్య విభేదాలు పొంచి ఉన్న సంగతి తెలిసిందే.

నిద్రమత్తులో అధిష్టానం

పార్టీ పరువును బజారున పడేసిన ఘటనలపై టిడిపి అధిష్టానం మీనమేషాలు లెక్కిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వెన్నుపోటు పొడిచిన నేతలపై వేటు వేయడంలో నిర్లక్ష్యమే సంక్షోభానికి కారణమనే వాదన వినిపిస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, రాజంపేట అసెంబ్లీ అభ్యర్థులకు ఇటువంటి సహాయ నిరాకరణ చేసిన నాయకులపై ఎటువంటి చర్యలు లేకుండా వదిలేయడమే క్రమశిక్షణారాహిత్యానికి కారణమనే విమర్శలు ఉన్నాయి. టిడిపి నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా టిడిపి అధిష్టానం దిద్దుబాటు చర్యలకు దిగుతుందా లేదోననే ఆందోళన కేడర్‌లో నెలకొంది.

పరిసరాల శుభ్రత పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి -కమలాపురం రూరల్

ప్రతి ఒక్కరూ పరిసరాలతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. శుక్రవారం కమలాపురం నియోజకవర్గం పొడదుర్తిలో 'ఇది మంచి ప్రభుత్వం' వంద రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య, కలెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇది మంచి ప్రభుత్వం వందరోజుల కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అందరికీ తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లోనే నిరుద్యోగ యువతకు మెగా డిఎస్‌సితో ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. నియోజకవర్గంలో ఎవరైనా చదువుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే అటువంటి వారికి ఉచితంగా డిఎస్‌సి కోచింగ్ ఇచ్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. వ్వ తాతలకు పెన్షన్ రూ. 1000 ఒకేసారి రూ.4000 ఇస్తున్నారన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించాలని, ఎస్ డబ్ల్యూ పిఎస్ ఖాళీ స్థలాలలో పండ్లు కూరగాయలు పండించి కనీసం ఒక గ్రీన్ అంబాసిడర్ జీతం తీయాలని అధికారులను ఆదేశించారు. కమలాపురం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.16 కోట్లతో ఎంజిఎన్‌ఆర్‌ఎస్ పనులు మంజూరు అయ్యాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఒకటి అమలు చేసుకుంటూ వస్తున్నారన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడ అభివృద్ధి కోసం రూ. 2000 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందని, ప్రతి ఒక్క పట్టాదారుకు పాస్ బుక్ పైన రాజముద్రతో ముద్రించి ఇస్తారని చెప్పారు. అంతకుముందు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా కమలాపురం ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ జమ్మలమడుగు మండలం వై కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాల, ఆదర్శ అంగన్వాడీ కేంద్రం ప్రాంగణంలో తల్లి పేరు మీద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారిద్దరూ వై.కొత్తపల్లి ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఎన్ని టన్నుల ఇసుక స్టాక్ పాయింట్‌లో ఉంది, రోజుకు ఎన్ని టన్నుల ఇసుక పంపిణీ చేస్తున్నారు వంటి అంశాలపై ఆరా తీశారు. అక్కడి అధికారులు సరిగ్గా సమాధానం చెప్పక పోవడంతో కలెక్టర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతనంగా ఆన్‌లైన్ విధా నంలో ఇసుక బుకింగ్ చేసుకునే విధానాన్ని సచివాలయాల సిబ్బంది ద్వారా అందరికీ తెలిపి ఉచిత ఇసుకను అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జ్యోతి, తహశీల్దార్ శివరామిరెడ్డి, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

అభివృద్ధికి రెక్కలు : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : సంక్షేమంలోనూ రాష్ట్ర అభివృద్ధికి రెక్కలు వచ్చేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కన్నేలూరులో ప్రజా వేదికను ఆర్‌డిఒ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ వంద రోజుల్లో జమ్మలమడుగు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం చేపట్టిందని తెలిఆపరు. మున్సిపాలిటీలో, గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు, జరుగు తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి ప్రభుత్వంగా ఏర్పడి ప్రజలందరికి మంచి ప్రభుత్వంగా ప్రజలకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం ఆర్‌డిఒ శ్రీనివాస్, ప్రజలకు చేస్తున్న మంచి పనులపై వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, దేవగుడి యూత్ సింగంరెడ్డి నాగేశ్వర రెడ్డి, కౌన్సిలర్ బాణా శివ రామలింగారెడ్డి, జింకల బాషా , నవనీశ్వర్ రెడ్డి అదికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకుందామని కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్వచ్ఛ హి సేవ కార్యక్రమంలో భాగంగా రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ తరునేందు శేఖర్, ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ మొక్కలు పెంచడం ప్రభుత్వ బాధ్యతగా చూడకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చూసినప్పుడే భావితరాలకు మంచి కాలుష్యరాహిత సమాజాన్ని అందిస్తామన్నారు. వివిధ ఫ్యాక్టరీలు ద్వారా వెలువడే కార్బన్‌డయాక్సైడ్ చెట్లు పీల్చుకొని ఆక్సిజన్ మనకు అందిస్తాయన్నారు. మొక్కలు పెంచడం ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్ వెంకటేశ్వర రెడ్డి వాలంటీర్లు, విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేత బృందం పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-కలసపాడు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో అండర్ - 17,- అండర్ -14 బాలికల విభాగాల్లో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీల్లో కెజిబివి విద్యార్థులు తమదైన శైలిలో సత్తాను చాటారని ఉన్నత పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సీ మాలిని అన్నారు. బాలుర విభాగంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ చూపారన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు భోజనం కల్పించిన సెయింట్ ఆంటోని స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఆ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కడప అర్బన్ : అతి తక్కువ ధరకు పేదల కడుపు నింపాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని జడ్‌పి కార్యాలయం, పాత బస్టాండు, మున్సిపల్ కార్యాలయాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, కెఎంసి కమిషనర్ వై.ఓ. నందన్‌లతో కలిసి క్యాంటీన్‌లలో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ పేదలకు ఆకలి అవస్థలు ఉండకూడదనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, హరి ప్రసాద్, జయ కుమార్, బిట్టా శ్రీధర్, టిడిపి జనసేన, బిజెపి కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

భవనాన్ని విద్యా శాఖకు అప్పగించాలి : 'ఫ్యాప్టో'

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప కార్పొరేషన్ స్వాధీనంలో ఉన్న సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యా శాఖకు అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్, సెక్రెటరీ జనరల్ షేక్. మొహమ్మద్ ఇర్షాద్ డిమాండ్ చేశారు. సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యా శాఖకు అప్పగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని పరిపాలనాధికారి కె.విజయ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నగరంలోని చెన్నూరు బస్టాండ్ వద్ద విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా వనరుల కేంద్రం, సైన్స్ మ్యూజియాలు నిర్మించి కొనసాగించేవారన్నారు. వీటిలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణలు ఇవ్వడంతో పాటు, విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శనకు వినియోగించే వారని పేర్కొన్నారు. కొంతకాలముగా నిధుల కొరత కారణంగా సైన్స్ ప్రదర్శనలు నిలిచిపోయాయని తెలిపారు. ఈ భవనాలను కడప కార్పొరేషన్ అధికారులు స్వాధీన పరుచుకుని అందులో ఆధార్ సెంటర్ ను నిర్వహిస్తున్నారన్నారు. మరో వైపు విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీంతోపాటు విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు నిర్వహించే సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శనలు పూర్తిగా ఆగిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సైన్స్ ప్రదర్శనలను తిరిగి ప్రారంభించేందుకు సమగ్ర శిక్ష పథకం నుంచి రూ.12 లక్షలు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ నిధులను వినియోగిస్తూ సైన్స్ మ్యూజియంను తిరిగి ప్రారంభించాలంటే ఆ భవనాల్లో కొనసాగుతున్న ఆధార్ సెంటర్లను ఖాళీ చేయాల్సి ఉందని చెప్పారు. కలెక్టర్ ఈ విషయంపై జోక్యం చేసుకుని విద్యా వనరుల కేంద్రం సైన్స్ మ్యూజియం భవనాలను విద్యాశాఖకు అప్పగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి సానుకూలంగా స్పందించారు.

టెక్స్‌టైల్ పార్కుకు మంచి రోజులు

- కలెక్టర్ శివ శంకర్ లోతేటి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప

మైలవరం టెక్స్‌టైల్ పార్క్ జిల్లా చేనేత జౌళి రంగానికి ఆయువు పట్టుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి చేనేత సంఘాలకు సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని విసి హాలులో మైలవరం టెక్స్ టైల్ పార్క్ లో చేనేత జౌళి యూనిట్ల స్థాపన కోసం లాటరీ పద్ధతి ద్వారా వాటాదారులకు ప్లాట్లను కేటాయించే కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో మైలవరం టెక్స్ టైల్ పార్క్‌కు మంచి రోజులు రానున్నాయన్నారు. 2005-2006లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మైలవరంలో 62.18 ఎకరాల స్థలాన్ని టెక్స్ పార్కు ఏర్పాటుకు కేటాయించిందని చెప్పారు. ఇందులో డైయింగ్ యూనిట్ - 21, గార్మెంట్ యూనిట్స్ - 32, పవర్ యూనిట్ - 37, హ్యాండ్లూమ్ యూనిట్స్ -12 హ్యాండ్లూమ్స్, పవర్ లూమ్ యూనిట్ - 16తో కలిపి మొత్తం -118 యూనిట్సను ఏర్పాటు చేసేందుకు వాటా దారుల నుండి దరఖాస్తులను స్వీకరించారన్నారు. అందుకోసం ప్రాథమిక చెల్లింపు (ఇనిషియల్ పేమెంట్) కింద రూ. 50 వేలను సెప్టెంబర్ 17లోపు పేమెంట్ చేసిన వారందరికీ లాటరీ తీశామన్నారు. లాటరీలో ప్లాట్ సొంతం చేసుకున్న మొత్తం 93 మందికి యూనిట్ల ప్రారంభించడానికి తాత్కాలిక హక్కును కల్పించామని చెప్పారు. ప్లాట్ అలాట్మెంట్ అయిన వారు నెలలోపు ప్లాట్ ఖరీదు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆరు నెలల్లో నిర్మాణం పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభించుకోవాలన్నారు. ప్లాట్ ఈ టెక్స్ టైల్ పార్కులో అవసరమైన సివిల్ వర్క్స్, రోడ్లు, వాటర్ కనెక్షన్లు, విద్యుత్తు మొదలైన మౌలిక వసతులన్నీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. టెక్స్ టైల్ పార్కు యూనిట్ల ఏర్పాటుకు చేనేత కార్మికులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా పిఎంఈజిపి ద్వారా సబ్సిడీతో రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం కూడా అందుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ప్లాట్లను సొంతం చేసుకున్న వాటాదారులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. మైలవరం టెక్స్ టైల్ పార్కు అభివృద్ధికి చేనేత కార్మికుల కమిటీ సభ్యులు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ప్లాట్లు సొంతం చేసుకున్న వాటాదారులందరూ ఒక గ్రూపు (కన్సార్టియం)గా ఏర్పడి పార్కు అభివృద్ధికి ముందడుగు వేయాలన్నారు. అధునాతనంగా రూపుదిద్దుకుంటున్న టెక్స్ టైల్ పార్కు ద్వారా జిల్లా చేనేత వైభవాన్ని ప్రపంచ స్థాయిలో కీర్తింపజేయాలని జిల్లా కలెక్టర్ వాటా దారులకు సూచించారు. టెక్స్ టైల్ సభ్యుల కమిటీ ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే.. పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, చేనేత జౌళి శాఖ ఆర్‌ఎం రాజా రావు, ఏడి నాగరాజ రావు, పరిశ్రమల శాఖ జిఎం జయలక్ష్మి, ఎపిఐఐసి డిప్యూటీ జెడ్‌ఎం మాధవీలత, చేనేత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

27న 'ఏచూరి' సంస్మరణ సభ

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏచూరి సంస్మరణ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకు సమస్మరణ సభ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రముఖులందరూ వచ్చి జయప్రదం చేయాలని కోరారు. సీతారాం ఏచూరితో పరిచయం ఉన్న జెఎన్‌యు విద్యార్థులు, పలు రంగాల్లో స్థిరపడ్డ వారు ఉన్నారని తెలిపారు. పార్లమెంట్‌లో జిల్లా ఎంపిలుగా గెలిచి ఏచూరితో పరిచయం ఉన్నవారు ఉన్నారని, ఆయన గురించి తెలిసిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వామపక్షాల నాయకులు ఉన్నారని వారందరూ ఈ సంస్మరణ సభకు హాజరవుతారన్నారు. ముఖ్యఅతిథిగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎం.ఏ. గఫూర్ హాజరవుతున్నారని తెలిపారు. ఏచూరి పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించడం మాత్రమే కాదు, భారత రాజ్యాంగం పీఠికలోని అంశాలకు రక్షకుడిగా తన జీవితాన్ని ధారపోశారన్నారు. ఆయన లౌకిక ప్రజాస్వామ్య భారతాన్ని శ్వాసించారని చెప్పారు. సామ్యవాద దృష్టితో పాలన జరగాలని జీవించారని పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యంలో ఇప్పుడు ఆయన లేని లోటు పెద్ద శూన్యం అన్నారు. విలువలు కోసం నిబద్ధతతో ఆయన సాగించిన నడక ఎందరికో దారి చూపించిందన్నారు. జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ పదవికి రాజీనామా చేయాలని ఇందిరా గాంధీనే నిలదీసిన విద్యార్థి నాయకుడు ఏచూరన్నారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ కోసం, 2004 - 2009లో యూపీఏ కూటమి కోసం, 202 లో ఇండియా కూటమి కోసం ఆయన చేసిన కృషి భారత సంకీర్ణ రాజకీయాల చరిత్రలో అపురూప ఘట్టమని గుర్తు చేశారు. దేశంలోని ఎందరో పేదల జీవితాలకు 'ఉపాధి హామీ పథకం" రూపంలో అన్నం గిన్నెలో అన్నం అయ్యారన్నారు. ఆయన ఆలోచనలు ఎన్నో చట్టాలుగా రూపొందాయి అన్నారు. రాహుల్ గాంధీ, సిఎంలు, మమతా బెనర్జీ, నారా చంద్రబాబు నాయుడు, ఎం.కే. స్టాలిన్, పినరై విజయం పెనరై విజయన్ ఇలా ఎందరో నాయకులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారని పేర్కొన్నారు. సంస్మరణ సభ జయప్రద చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ పాల్గొన్నారు.

మభ్యపెట్టడం చంద్రబాబుకే చెల్లు

ప్రజాశక్తి - కడప

ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని, సూపర్ సిక్స్‌లో ఏది నెరవేర్చారో చెప్పాలని, ప్రజలను మభ్యపెట్టడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే చెల్లుతుందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పరిపాలనపై ఎక్కడ లేని హడావుడి చేస్తున్నారు అని ఎద్దేవా చేశారు. ఏమీ చేయకపోయినా చేసినట్లు మభ్యపెట్టడం చంద్రబాబుకే చెల్లు అవుతుందన్నారు. ఉద్యోగుల జీతాలు, వృద్ధాప్య పింఛన్లు తప్ప ఏమి చేశారో సమాధానం చెప్పాలన్నారు. అమ్మకు వందనం అన్నారు, రూ. 100కు మద్యం అని అన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని లక్షల పెన్షన్లు తీసేసారన్నారు. మహిళలు ఉచిత సిలిండర్లు, బస్సు ప్రయాణం, రూ. 1500 కోసం ఎదురుచూస్తున్నారు వాటి ఊసే లేదని ఆరోపించారు. ఖరీఫ్ కూడా ముగుస్తున్నా ఇస్తానన్న రూ.20 వేల సంగతి ఏంటని ప్రశ్నించారు. భృతిపై నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారని దాని గురించి పట్టించుకోలేదని వాపోయారు. సంపద సృష్టిస్తానని చెప్పి వంద రోజుల్లో 20వేల కోట్ల అప్పు చేశారన్నారు. ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే ఇసుక స్టాక్ యార్డులో నుంచి మాయమైపోయిందన్నారు. జగన్ 17 మెడికల్ కళాశాలు తెస్తే వాటిని వేల కోట్లకు అమ్ముకోబోతున్నారు అని అన్నారు. వచ్చిన మెడికల్ సీట్లు వెనక్కి పంపుతున్న దుస్థితి చంద్రబాబు ప్రభుత్వంలో ఏర్పడిందన్నారు. నేడు రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ ఉందో లేదో కూడా అర్థం కావడం లేదని వాపోయారు. ఇప్పుడిప్పుడే ప్రజలు వాస్తవాలను గుర్తిస్తున్నారన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, పాకా సురేష్, రామ్ లక్ష్మణ్ రెడ్డి పాల్గొన్నారు.

చర్చలు విఫలం.. సమ్మె కొనసాగింపు

ప్రజాశక్తి- కడప అర్బన్

జీవో నంబర్ 85 రద్దు కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం తమ నిరసనలను కొనసాగించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 10 నుంచి జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల వైద్యుల దశలవారీ ఆందోళనలు చేపడుతున్న విషయం విదితమే. బుధవారం ప్రభుత్వం, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించగా, వైద్యులు ప్రభుత్వ ప్రతిపాదనలను తిరస్కరించారు. తమ ప్రాథమిక డిమాండ్ అయిన జీవో 85 రద్దు చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల వైద్యులు డీఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన తెలిపారు. 23న చలో విజయవాడ చేపడుతున్నట్లు ఎపిపిహెచ్‌సిడిఎ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎపిపిహెచ్‌సిడిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వినయ్ కుమార్, కోశాధికారి డాక్టర్ మొహమ్మద్ తాహ, ఇతర పిహెచ్‌సి వైద్యులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న పిహెచ్‌సిల వైద్యులు

అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో అంగన్వాడీ వర్కర్ల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి బి.లక్ష్మీదేవి, కోశాధికారి ఎ.పి. అంజనీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల, కమలాపురం, జమ్మల మడుగు ప్రాంతాలలో వర్కర్ల పట్ల రాజకీయంగా వేధించడం సరైందని కాదన్నారు. సింహాద్రిపురం, వేంపల్లి, వేముల, కమలాపురం, కొండాపురం, ముద్దనూరు మండలాలలో అంగన్వాడీలను ఇబ్బందులు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఎవరిపై కక్ష సాధింపులు చేయకూడదని ప్రకటించారని తెలిపారు. ఆయన మాటలు గౌరవించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పైన ఏమాత్రం గౌరవం ఉన్నా స్థానికంగా రాజకీయ వేధింపులు ఆపాలని తెలిపారు. కొన్ని సెంటర్లలో తాళాలు వేసి బయటకు వెళ్లమని చెప్పడం, ఉద్యోగాలు కావాలని బెదిరించడం దారుణమని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భంలో సూపర్‌వైజర్లు, సిడిపిఒలపై ఒత్తిడి తేవడం వల్ల ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక అంగన్వాడీ వర్కర్లను ఇబ్బందులు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాజకీయ వేధింపులు ఆపాలని తెలిపారు. ఇదే విధానం కొనసాగితే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

పంట కాలువలు పూడ్చేసిన బిల్డర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : దేవుని గడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న నానాపల్లె రోడ్డులో పంట కాలువలు పూడ్చివేసి బిల్డర్లు గృహాలు నిర్మిస్తున్నారని దేవుని కడపకు చెందిన వై.సుదర్శన్ కడప తహశీల్దార్ ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 512లో ఉక్కాయ పల్లె పొలంలో అక్రమ లేఅవుట్లు వేస్తున్నారని పేర్కొన్నారు. పంట కాలువ ఎంత ఉందో సర్వే చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని రిమ్స్ ఆసుపత్రిలో మొహమ్మద్ ప్రవక్త జయంతి మాసం శుభ సందర్భంగా శుక్రవారం అస్సాలిహత్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు రిమ్స్‌లో ఉన్న రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ హెడ్మాస్టర్ మొహమ్మద్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ మహా ప్రవక్త మొహమ్మద్ జన్మదినం మాసంను పురస్కరించుకుని సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఇటువంటి పవిత్రమైన మీలాదున్ నబీ మాసంలో సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హయత్, ముస్లిం ప్రముఖులు హమీద్, స్కూల్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆర్‌టిసి సమస్యలపై డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సూచనలు 9959225848 సెల్ నంబ కు ఫోను గాని, వాట్సప్ కాని చేయాలని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి

ప్రజాశక్తి - వల్లూరు : గుండెపోటుతో ఉపాధి కార్మికుడు మృతి చెందిన సంఘటన వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పెద్దపుత్త గ్రామానికి చెందిన పెద్ద గంగులయ్య (68) ఉపాధి హామీ చట్టంలో భాగంగా గ్రామ సమీపంలోని చెరువు వద్ద పని చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన సహచర కార్మికులు వెంటనే కమలాపురం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వపరంగా అందాల్సిన పరిహారం నిమిత్తం ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు తెలిపారు. ఎంపిడిఒ జయశ్రీ, ఎపిఒ సుధారాణి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



వీధిలో సంచరిస్తున్న పందులు

వెంటాడుతున్న పందుల బెడద

ప్రజాశక్తి -మైదుకూరు (చాపాడు)

మైదుకూరు మున్సిపాలిటీ ప్రజలను పందుల బెడద తీవ్రంగా వెంటాడుతోంది. మున్సిపాల్టీ పరిధిలోని 24 వార్డులలో 18 వార్డుల వరకు మైదుకూరు పట్టణంలోనే ఉన్నాయి. పట్టణ పరిధిలో అన్ని కాలనీల్లో పందుల బెడద అధికంగా ఉంది. ముఖ్యంగా బద్వేల్ రోడ్డు లోని జోసఫ్ పేట, శాంతి నగర్, మహబూబ్ నగర్, మార్కెట్ రోడ్డు, కడప రోడ్డు లోని మసీదు రోడ్డు, రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు, బస్టాండ్, నంద్యాల రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డులోని కెసి కాలువల వద్ద పందుల సంచారం అధికం కావడంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 120 వరకు నిల్వ ఉండే మురుగు కుంటలు ఉన్నట్లు ఆరోగ్య శాఖ సిబ్బంది గుర్తించారు. ప్రధాన రహదారి వెంబడి పందులు ఒక్కసారిగా రోడ్డు దాటుతుండటంతో ద్విచక్ర వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురైన సందర్భాలు కోకొల్లలు. మున్సిపాలిటీ అధికారులు పలు దఫాలు పందుల యజమానులను పిలిపించి మాట్లాడినప్పటికీ ఉపయోగం లేదు. అందులో పందుల యజమానులను మున్సిపాల్టీ వర్కర్లుగా విధుల్లోకి తీసుకుంటామని కచ్చితమైన హామీ లేకపోవడంతో వారు పందుల పెంపకాన్ని వదిలేయడం లేదు. వాటిని ఒక చోట సంరక్షించు కోకుండా ఇష్టానుసారంగా వదులుతున్నారు. దీంతో అవి మురుగు కుంటలలో తిరుగుతూ దుర్వాసన వెదజల్లుతు రోగాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ఇష్టానుసారంగా తిరుగుతున్న పందుల బెడద లేకుండా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూటమి ముంచే ప్రభుత్వం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె



మాట్లాడుతున్న తులసిరెడ్డి

చంద్రబాబు ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదని, ప్రజలను ముంచే ప్రభుత్వమని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా తమ ప్రభుత్వం మంచి ప్రభుత్వమని కూటమి నాయకులు సొంత డబ్బా కొట్టుకోవడం హాస్యాస్పదమన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చేందుకు సూపర్ సిక్స్ హామీలు ప్రధాన కారణమన్నారు. ఒక్క సామాజిక పెన్షన్ తప్ప మిగిలిన 5 హామీలు అమలు కావడం లేదన్నారు. రైతు, యువత, విద్యార్థి, మహిళ, బిసి, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలను నమ్మించి మోసగించిన ప్రభుత్వాన్ని మంచి ప్రభుత్వం అంటారా అని తులసిరెడ్డి ప్రశ్నించారు. ఉచిత ఇసుక విధానాన్ని ఆయన తప్పు పట్టారు. పులివెందుల మెడికల్ కళాశాలకు ఎన్ఎంసి 50 సీట్లు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం వద్దని చెప్పడం అసమర్థతకు పరాకాష్ట అన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని విమర్శించిన టిడిపి గడిచిన వంద రోజుల్లో రూ. 25 వేలు కోట్లు అప్పు చేయడం విడ్డూరమన్నారు. వట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేల్ తలపెట్టవోయ్ అన్న సూక్తిని బాబు ప్రభుత్వం పాటించడం మంచిదన్నారు. లేదంటే జగన్ ప్రభుత్వానికి పట్టిన గతే బాబు ప్రభుత్వానికి కూడా పడుతుందని తులసిరెడ్డి హెచ్చరించారు.

మండల ప్రత్యేక అధికారిగా విజయలక్ష్మి

ప్రజాశక్తి - చాపాడు : చాపాడు మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఆత్మ పీడీవిజయలక్ష్మిని ఉన్నత అధికారులు నియమించారు. శుక్రవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. మండల స్థాయి అధికారులు అందుకు అనుగుణంగా సహకరించాలన్నారు. మండల అధికారులు ప్రత్యేక అధికారిని కలిసి పరిచయం చేసుకున్నారు.

ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు



నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అబేట్ ద్రావణం పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్షుమయ్య అన్నారు. మండలంలోని రాజుల గురువాయపల్లె, ముద్దనూరు బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా లార్వా, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి ప్రాణాంతకమైన జ్వరాలు వస్తాయని ఆరోగ్య విద్య ద్వారా వివరించారు. దోమ కాటుకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి తొట్లు, టైర్లు, వాషింగ్ మిషన్లు, ఫ్రిజ్, వీధి రోడ్లలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆడ ఏనాఫిలిష్ దోమ గుడ్లు పెట్టడం వల్ల దోమ లార్వాగా మారుతుందన్నారు. నీరు నిల్వ ప్రదేశాల్లో, డ్రెయినేజీల్లో అబేట్ ద్రావణం పిచికారి చేయాలన్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సిహెచ్ఒ వాణి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సంధ్య, నీలవేణి, హెల్త్ అసిస్టెంట్ ఓబులేసు, వరలక్ష్మి, ప్రజలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుడిసెకు నిప్పు పెట్టిన దుండగలు

ప్రజాశక్తి- గోపవరం

మండలంలోని సంగ సముద్ర గ్రామానికి చెందిన ఈర్ల రోశయ్య పొలంలో ఉన్న గుడిసెకు శుక్రవారం ఉదయం గుర్తు తెలియని నిప్పు పెట్టారు. అక్కడ ఉన్న వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే గుడిసెలో ఉన్న యూరియా, పాస్పెట్, క్ర్ర సామాన్లు ఇతర పరికరాలు ఖాళీ బూడిదయ్యాయి. సుమారు రూ. లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

108 వాహన సిబ్బంది చరవాణి చోరీ

ప్రజాశక్తి -ఖాజీపేట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉండే 108 వాహన టెక్నీషియన్ షమీవుల్లాకు చెందిన ఫోన్ చోరీకి గురైంది. శుక్రవారం తెల్లవారు జామున ఘటన చోటు చేసుకుంది. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఈ చోరీ ఘటనకు సంబంధించి సిసి కెమెరా ఫుటేజీలో నమోదైన దృశ్యాల ఆధారంగా చారణ సాగిస్తున్నారు.

రెండు లారీలు ఆపి దోపిడీ

ప్రజాశక్తి-ముద్దనూరు

కడప- తాడిపత్రి ప్రధాన రహదారిలోని కొత్తపల్లి సమీపం వద్ద గురువారం అర్ధరాత్రి 9 మంది వ్యక్తులు రెండు లారీలను అడ్డగించి వారిని బెదిరించి ఒక వెండి ఉంగరం, 3 సెల్ ఫోన్లు, రూ.20వేలు దోపిడీ చేసినట్లు శుక్రవారం సిఐ దస్తగిరి తెలిపారు. లారీ డ్రైవర్ల ఫిర్యాదు మేరకు సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల డిమాండ్

ప్రజాశక్తి - చక్రాయపేట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి

చక్రాయపేట మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని మండల ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డికి కోరారు. శుక్రవారం చక్రాయపేట మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ హాజరయ్యారు. తొలుతగా వారికి ఎంపిడిఓ, సోమశేఖర్ స్వాగతం పలికారు. అనంతరం ఎంపిపి మాధవి బాలకృష్ణ, జడ్‌పిటిసి శివప్రసాద్ రెడ్డి, ఎంపిడిఓ సోమశేఖర్ సమక్షంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వం సోలార్ ప్లాంట్‌కు ఇచ్చిన భూములను తిరిగి రైతుల పేరిట నమోదు చేయాలని తహశీల్దార్ విజయకుమారిని ఆదేశించారు. మండలంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, అర్హులైన భూ యజమానికి ఇవ్వాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. భూ సమస్యలు పరిష్కరించకపోతే తగు చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించకపోవడంతో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలు గండ్లం వారి పల్లె, గొంది, వరికుంటపల్లెతో పాటు పలు గ్రామాల నీటి సమస్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రాజు పల్లె వద్ద ఉన్న మంచినీటి పథకం మూడు రోజుల కిందట మరమ్మతులకు గురైందని ఆ పథకం కింద ఉన్న గ్రామాలు కె.రాజు పల్లె, ఎర్రగుడి, కుప్పం, బురుజు పల్లి, తో పాటు పలు గ్రామాలు నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే రిపేరు చేయించి తాగునీటి పరిష్కరించాలని అధికారులను కోరారు. విద్యుత్ శాఖ సమస్యలపై కుమార్ కాలువ గ్రామంలో పలుసార్లు అధికారులకు నివేదిక అందించిన ఫలితం లేదని ఆ గ్రామ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగు పథకం ద్వారా ఎపిఎం ఆంజనేయులు డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన పథకాలను క్షుణ్ణంగా వివరించారు. విద్యాశాఖ అధికారులు ఎంఇఓ-2 రవికుమార్ అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం అందించిన బ్యాగులతో పాటు పుస్తకాలను పంపిణీ చేశామని చెప్పారు. అగ్రికల్చర్ అధికారి నవనీత్ బాబు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటను ఈ-క్రాప్ తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. హౌసింగ్ అధికారి కృష్ణయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఇళ్లను త్వరగా పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరు చేస్తామని చెప్పారు. ఎపిఒ రవి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనులు చేసి బిల్లులు రాకపోయిన వారికి త్వరగా బిల్లులు వచ్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డికి కోరారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఆజాద్ వలి, ఏడి గురు మోహన్ రెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఒ సునీత, సిహెచ్ఓ వెంకట్రామ్‌రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎఇ శ్రీహరి, మండలంలోని అన్ని గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- టిడిపి ఇన్‌ఛార్జి రవీంద్రనాథ్‌రెడ్డి



హ్యాండ్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న బిటెక్ రవి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లిలో తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 38వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ బాలికల, బాలుర క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాల్లో రాణించాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేంపల్లెలోని ఆట స్థలంలో క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు క్రీడా మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వేంపల్లెలో రాష్ట్ర స్థాయిలో హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని చెప్పారు. తల్లిదండ్రులు కూడా చదువుకే ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వకుండా క్రీడాల్లో కూడ విద్యార్థులు రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. క్రీడాల వైపు విద్యార్థులు మొగ్గు చూపక పోవడంతో ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు రావడం లేదన్నారు. క్రీడాల్లోతోనే విద్యార్థులకు గుర్తింపు వస్తుందని చెప్పారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని చెప్పారు. వేంపల్లెలో ఉన్న ఆట స్థలం పులివెందులలో కూడ లేదన్నారు. పోటీతత్వం అనేది విద్యార్థుల్లో ఉండాలని సూచించారు. క్రీడాల పట్ల దృష్టి పెట్టేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సాహించాలని కోరారు. క్రీడాల్లో పాల్గొన్న విద్యార్థులకు భోజనం, వసతి సౌకర్యం అవసరమైతే తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. కార్యక్రమంలో జయరామిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, రజనీకాంత్ రెడ్డి, గాలి హరి, సుష్మా, భాస్కర్, కృష్ణారెడ్డి, రెడ్డి కిషోర్, బాలస్వామిరెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, వేమా కుమార్, డాక్టర్ కరీముల్లా, పీరా సాహెబ్, జబిబుల్లా, దొంతు సుమన్, వీరభద్ర, దేవస్థానం మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు, ఎస్ వి. రమణ, ప్రధానోపాధ్యాయులు శివ మునెమ్మ, నారాయణమ్మ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, భారతి, శేషారెడ్డి, యాసిన్ తో పాటు పలువురు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.




రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఏర్పడిన భారీ గుంత

భారీ గుంతను పూడ్చాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ముద్దనూరు రోడ్డు నుంచి ఆర్‌టిపిపి, పోట్లదుర్తికి వెళ్లే దారిలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఏర్పడిన భారీ గుంతను వెంటనే పూడ్చి వేయాలని ఏపీ కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస సుబ్బిరెడ్డి రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షం పడినపుడు నీరంతా బ్రిడ్జి కింద భారీగా నిలుస్తుందన్నారు. గుంత ఉందని తెలియక అటుగా వెళ్ళే ద్వి చక్ర వాహన దారులు ప్రమాదానికి గురి అవుతున్నారని అన్నారు. నిత్యం వందలాది మంది కార్మికులు ఆర్‌టిపిపికి విధి నిర్వహణ కోసం వచ్చి వెళ్తుంటారని, అలాగే పులివెందుల , ముద్దనూరు తదితర ప్రాంతాల ప్రజలు వివిధ పనులకోసం ప్రొద్దుటూరు వెళ్ళడానికి ఈ దారి వెండే వెళ్తుంటారని చెప్పారు. వందలాది వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే దానిలో భారీ గుంత పడడంతో చాలా అసౌకర్యంగా ఉందన్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే రైల్వే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి

ప్రజలకు చేరువగా ప్రభుత్వం

ప్రజాశక్తి - చాపాడు

వంద రోజుల్లో ప్రజలకు ప్రభుత్వం చేరువైందని మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం చాపాడు సచివాలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతూ మెగా డీఎస్సీ, రూ.5 తోనే ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లు, రూ. నాలుగు వేలు పెన్షన్, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు స్టిక్కర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, ఈఓపీఆర్డీ రాధాకృష్ణ వేణి, వ్యవసాయ అధికారి మ్యాగీ ఎంఈఓ రవిశంకర్, వంశీకృష్ణ, టిడిపి నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమంపై మాట్లాడే హక్కు వైసిపికి లేదు

ప్రజాశక్తి - చాపాడు : సంక్షేమం గురించి మాట్లాడే హక్కు వైసిపికి లేదని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రులు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులలో వరదలు వచ్చినా సంక్షేమ పథకాల అమలులో అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి మేనిఫెస్టోలో పెట్టిన హామీలలో అవ్వా-తాతలకు పెన్షన్ రూ.4వేలు, వికలాంగులకు రూ. 6వేలు ఇస్తున్నారని చెప్పారు. అన్న క్యాంటీన్లు, నిరుద్యోగులకు మెగా డిఎస్‌సి మొదలగు హామీలు నెరవేర్చి దీపావళి కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అమలు దిశగా ముందుకు పోతున్నారన్నారు. నేపథ్యంలో వైసిపి నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు. రైతులకు బాకీ పడ్డ ధాన్యం బకాయిలు కూడా రూ.1674 కోట్లు సంక్షేమ నిధులను విడుదల చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ఔదార్యం

ప్రజాశక్తి - వేంపల్లె : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించి ఔదార్యం చాటుకొన్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగా ఆంజనేయులు తెలిపారు. వరద బాధితుల కోసం విద్యార్థులు 150 కిలోల బియ్యం, దుస్తులు, రూ.28 వేలు డబ్బులను సేకరించినట్లు చెప్పారు. నగదును ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపినట్లు చెప్పారు. బియ్యం, దుస్తులను యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్‌కు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాలతో మైదుకూరు పట్టణంలోని శాంతినగర్ దగ్గర ఉన్న కెసి కెనాల్ వద్ద ముళ్ళ పొదలను శుక్రవారం టిడిపి క్లస్టర్ 21, 22వ వార్డుల ఇన్‌ఛార్జి కృష్ణయ్య ఆధ్వర్యంలో జెసిబి ద్వారా తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేందుకు శాంతినగర్ కెసి కెనాల్ కట్టమీద ఉన్న వ్యర్థాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో శాంతినగర్ బూత్ ఇన్‌ఛార్జి ఐ ప్రసాద్, సుధాకర్, దేవ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇండియా కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దొర సానిపల్లి గ్రామం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అంతులేని అప్పులు చేసిందని, అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా అధికారంలో వచ్చిన వెంటనే పింఛన్లు రూ. 4000 ఇస్తున్నారని చెప్పారు. రూ.167 4.47 కోట్ల తో ధాన్యం కొనుగోలు బకాయిలను చెల్లించి అన్నదాతను ఆదుకున్నారని తెలిపారు. స్థానిక సంస్థలకు రూ.1452 కోట్లు ఇచ్చి గ్రామాలకు పట్టుగొమ్మలైన పంచాయతీలకు ప్రాణం పోశారన్నారు. పేదల కోసం రాష్ట్రవ్యాప్తంగా కేవలం రూ. 5లకే ఆకలి తీర్చే 175 అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించడం సంతోషకరమన్నారు. ప్రజలకు నిద్రలేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడంతో ప్రజలు ఆనందం వ్యక్తపరుస్తున్నారని పేర్కొన్నారు. దీపావళి పండగ పురస్కరించుకొని ఉచిత సిలిండర్ పథకాలను కూడా ప్రభుత్వం త్వరలో ప్రారంభిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, సర్పంచ్ ఆరవ ఈశ్వరమ్మ, టిడిపి నియోజకవర్గ పరిశీలకుడు ఏవీఆర్ ప్రసాద్, స్థానిక నాయకులు పాతకోట భాస్కర్ రెడ్డి, మాడెం సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మార్తల లక్ష్మిరెడ్డి, మండల కన్వీనర్ బోడేల బాబులరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి, తహశీల్దార్, ఎంపిడిఒ, పశువైద్యాధికారి డాక్టర్ సరస్వతి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాల సిబ్బంది, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రొద్దుటూరులోని విజయకుమార్ సర్కిల్ టిబిరోడ్డులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. అనంతరం భోజనాల నాణ్యతపై అక్కడ భోజనం చేస్తున్న వారిని నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. టిడిపి నాయకులు బద్వేలి రవీంద్రారెడ్డి పెద్దనాన్న బద్వేలి రాఘవరెడ్డి జ్ఞాపకార్థం 500 మందికి ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు.

కారణజన్ముడు 'అక్కినేని'

ప్రజాశక్తి - వేంపల్లె

నట సామ్రాట్, పద్మ విభూషణ్, దాదా సాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వర రావు కారణజన్ముడని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి చెప్పారు. అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కినేని విలక్షణమైన నటుడని చెప్పారు. దాదాపు 255 సినిమాలలో నటించినట్లు చెప్పారు. దేవదాసు, ప్రేమనగర్, ప్రేమాభిషేకం, దసరా బుల్లోడు మిస్సమ్మ లాంటి సినిమాలలో అక్కినేని నటన నభూతో న భవిష్యత్ అన్న విధంగా ఉందన్నారు. జీవించి సాధించు - మరణించి జీవించు అన్నది ఆయన సందేశం అన్నారు. అక్కినేని జీవితం భావితరాలకు మార్గదర్శకం అన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని ఓబన్నపేటలో 'ఇది మంచి ప్రభుత్వం' శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కూటమి ఇన్‌ఛార్జి శివ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చి వంద రోజుల పాలనలో ప్రజలకు ఎంత మేలు జరిగిందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం తమదే న్నారు. ముఖ్యంగా పింఛన్లు ఉద్యోగులతో సమానంగా ప్రతినెలా ఒకటో తేదీన ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నాగప్రసాద్, మండల కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, గండూరి శంకర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గోరిశెట్టి బాబు రేగడి పల్లి మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి ఓబన్నపేట సర్పంచ్ గోపి ప్రతాప్ రెడ్డి గిరీష్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బిటెక్ రవి

ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఒ సభా భవనంలో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పథకాలను అమలు చేస్తూ ప్రజల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా ఎన్నికల హామీల భాగంగా మెగా డిఎస్‌సితో 16,437 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టిందని చెప్పారు. పింఛన్లను ఒకేసారి రూ. వెయ్యి పెంచి మొత్తం రూ. 4000 లబ్ధిదారులకు అందజేస్తోందన్నారు. పేదల కోసం రూ. 5లకే అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించిందని చెప్పారు. ఇటీవల విజయవాడ నగరంలో చోటు చేసుకున్న వరదల సమయంలో సిఎం చంద్రబాబు నాయుడు అక్కడే 10 రోజుల పాటు ఉండి వారి ఇబ్బందులను గుర్తించి పరిష్కరించారన్నారు. వందరోజుల పాలనలో సిఎంతోపాటు నాయకులు సైతం ప్రజలకు అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం బీడీ కాలనీలో ఇంటింటికి వెళ్లి వందరోజుల పాలనపై కరపత్రాలను అందజేసి చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో టిడిపి వేంపల్లి మండల పరిశీలకుడు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి, మండల ప్రత్యేక అధికారి ససన్న, ఎంపిడిఒ కృష్ణమూర్తి, తహశీల్దార్ గుర్రప్ప, మండల పరిశీలకుడు జోగి రెడ్డి, టిడిపి నాయకులు శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ ఎఇలు ఉదయ్ కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, మండల వ్యవసాయ శాఖ అధికారి శివ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలుకు శ్రీకారం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒకార్యాలయం సమీపంలోని వైఎస్ఆర్ సభా భవనంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జరిగిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. 100 రోజుల తెలుగుదేశం పార్టీ పరిపాలన గురించి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు వివరించాలని కోరారు. చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు ప్రారంభం, నిరుద్యోగ యవత భవిష్యత్తుపై దృష్టి పెట్టి మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలతో పాటు వరదల్లో నష్టపోయిన ప్రజలకు పరిహారం ఇచ్చి ఆదుకున్నారని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేస్తున్నారన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ .5 లక్షల నుంచి రూ 10 లక్షలు పెంచారని చెప్పారు. సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యం అవుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సంపతి దివిజా, దేవస్థానం మాజీ చైర్మన్ జివి రమణ, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, ఈఓపిఆర్డి మల్లికార్జున రెడ్డి, టిడిపి నేతలు డివి సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, మైసూరారెడ్డి తో పాటు అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుకు పాలాభిషేకం

ప్రజాశక్తి - కడప



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నమడక చక్రధర్

టిడిపి తొగటవీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు మడక చక్రధర్ ఆధ్వర్యంలో తన కార్యాలయంలో బిసిల బాంధవుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, సవితమ్మల ఫోటో బ్యానర్‌కు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మడక చక్రధర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీలకు వెన్నుముక లాంటిది అన్నారు. అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించినప్పటి నుంచి బిసిలకు పార్టీలో సముచిత స్థానం కల్పించి ఆర్థిక రాజకీయ అవకాశాలు కల్పించి వారి అభివృద్ధికై నిరంతరం కృషి చేశారన్నారు. అదే నినాదంతో చంద్రబాబు నాయుడు నిన్న క్యాబినెట్లో బిసిలకు 33 శాతం చట్టసభలలో రిజర్వేషన్ కల్పిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం చాలా అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రాయచోటి రాచ్చయ్య శ్రీకాంత్, నరేష్, షేక్ అమీర్ భాష, మిస్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.